క్లుప్తంగా

ప్రవేశ పరీక్ష నేడు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని కుప్పిలి మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశాలకు పరీక్షను సోమవారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ అప్పాజీరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. హాల్ టిక్కెట్, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్‌కార్డు జిరాక్సులతో పరీక్షకు హాజరవ్వాలని సూచించారు.

బాధ్యతల స్వీకరణ



తహసీల్దార్ రాజశేఖర్‌కు అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

ఎచ్చెర్ల: లావేరు మండల తహసీల్దార్‌గా ఎం.రాజశేఖర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన ఎన్ని జోగారావు శ్రీకాకుళం కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. విజయనగరం జిల్లా రాజాం మండలం నుంచి రాజశేఖర్ ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలాన్ని ఆదర్శప్రాయంగా నిలిపేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఆయనకు అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు.

వీరయ్యవలసలో సంబరాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని వీరయ్యవలస గ్రామంలో ఘనంగా రామయ్య తండ్రి సంబరాలు ఆదివారం నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేపట్టారు. గ్రామస్తులు మొక్కులు తీర్చుకున్నారు. తప్పెటగుళ్లు, భజన కార్యక్రమాలతో సంబరాలు నిర్వహించారు. బంధుమిత్రులతో గ్రామంలో ఆధ్యాత్మికత సంతరించుకుంది.

వైభవంగా త్రినాథస్వామి ఆలయ వార్షికోత్సవం

గార: కళింగపట్నంలోని రాధాకృష్ణపేట (కంద్రపేట)లో ఆదివారం ఉదయం త్రినాథస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని భక్తులు వైభవంగా నిర్వహించారు. స్వామిమూర్తులకు ప్రత్యేక పూజల్లో భాగంగా అష్టోత్తర శతనామావళి జరిపించారు. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు రాధాకృష్ణ భక్తులు భజనలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించగా, అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

ఆశాజనకంగా నువ్వుల సాగు



పోతయ్యవలసలో సాగు చేస్తున్న నువ్వుల పంట

ఎచ్చెర్ల: లావేరు మండలంలో నువ్వుల పంట సాగు ఆశాజనకంగా సాగుతోంది. మండలంలోని ఎక్కడ చూసినా నువ్వుల పంటలే దర్శనమిస్తున్నాయి. నువ్వు పంట ఏపుగా పెరిగి మంచి కాయలు కాయడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మంచి దిగుబడి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. లావేరు, వెంకటాపురం, లింగాలవలస, పోతయ్యవలస, మురపాక, చిన్నమురపాక, అదపాక తదితర ప్రాంతాల్లో ఈ పంటను అధికంగా సాగు చేస్తున్నారు.

చిన్నారులకు పోటీలు



బహుమతులు గెలుచుకున్న చిన్నారులు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న ధర్మశాస్తా ఆలయంలో చిల్డ్రన్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో చిన్నారులకు ఆటల పోటీలు జరిగాయి. 30 మంది చిన్నారులు పాల్గొనగా కావ్య, సురేంద్రలు ప్రథమ, ద్వితీయ బహుతులు గెలుచుకున్నారు. కార్యక్రమంలో ఎల్.నందికేశ్వరరావు, ప్రసాద్, బీఎంఎస్ పట్నాయక్ పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రణస్థలం: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గత వారం రోజులుగా వివిధ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని రణస్థలం అగ్నిమాపక అధికారి పైల అశోక్ తెలిపారు. మండలంలోని రణస్థలం సీహెచ్‌సీ, అగ్నిమాపక కార్యాలయం వద్ద అగ్ని ప్రమాదాలపై ఆదివారం అవగాహన కల్పించారు. విద్యార్థులకు అగ్ని ప్రమాదాల పరికరాల వినియోగంపై వివరించారు. అనంతరం ప్రమాదాల నివారణపై కరపత్రాలు పంపిణీ చేశారు. అగ్నిమాపక వారోత్సవాల్లో సహకరించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రణస్థలం ఏఎఫ్‌వో పోలినాయుడు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

నీటికి కటకట!

- ఎచ్చెర్ల నియోజకవర్గంలో అడుగంటిన భూగర్భజలాలు
- 71 గ్రామాల్లో వ్యవసాయ బోర్ల తవ్వకాలు నిషేధం
- ఆందోళనకరంగా ఉన్న కేంద్ర భూగర్భ జల వనరుల శాఖ నివేదిక



రణస్థలం: అయ్యప్పస్వామి ఆలయ సమీపంలో అడుగంటిన చెరువు

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గంలో భూగర్భ జలాల స్థాయి ఆందోళనకరంగా మారాయి. కేంద్ర భూగర్భ జల వనరుల శాఖ వెల్లడించిన నివేదిక ప్రకారం నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో నీరే దొరకని పరిస్థితి దాపురించింది. ఈ ప్రభావంతో కొన్ని పంచాయతీల్లో ఏకంగా వ్యవసాయ బోర్లు తవ్వకాలను పూర్తిగా నిషేధించారు. జిల్లా వ్యాప్తంగా కొన్ని మండలాల్లో భూగర్భ జలాలు ఒక మాదిరిగా అడుగంటినట్లు నివేదిక చూపుతున్నా ఒక్క రణస్థలం మండలంలో మాత్రం ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని 71 గ్రామాల్లో అసలు నీళ్లే దొరకని పరిస్థితి నెలకొంది. ఇందుకు ప్రధాన కారణంగా భూగర్భ జలాలు ఇష్టానుసారంగా తోడేయడమేనని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్‌లో చుక్కనీరు కూడా దొరకని పరిస్థితి ఉత్పన్నమయ్యే ప్రమాదముందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

నిషేధిత జాబితాలో ..

జిల్లా వ్యాప్తంగా 76 గ్రామాల్లో కేంద్ర భూగర్భ జల వనరుల శాఖ బోర్లు తవ్వకుండా నిషేధిత జాబితాలో చేర్చింది. పొందూరు మండలంలోని 5 గ్రామాలను మినహాయిస్తే మిగతా 71 గ్రామాలు ఎచ్చెర్ల నియోజకవర్గంలోనే ఉండటం గమనార్హం. ఎచ్చెర్లలో 1, జి.సిగడాంలో 6, లావేరులో 18 ఉండగా అత్యధికంగా రణస్థలం మండలంలో 46 గ్రామాలు ఉండటం ఆందోళనకరంగా ఉంది. కొన్నేళ్లు క్రితం రణస్థలం మండలంలో 11 గ్రామాలే ఉండగా తోటపల్లి కాలువ సాగునీరు రావడంతో నిషేధ జాబితా నుంచి తొలగించారు. మరలా 46 గ్రామాలు పెట్టడంతో రణస్థలం మండల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

పరిశ్రమలే కారణమా..

రణస్థలం మండలంలోనే అత్యధికంగా పరిశ్రమలు నెలకొని ఉన్నాయి. వీటి నిర్వహణ అవసరాలు అంతా భూగర్భ జలాలుపైనే ఆధారపడం వల్ల అత్యధికంగా నీటి వినియోగం అవుతుంది. దీంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో తోటపల్లి కాలువ నీరు వస్తే భూగర్భ జలాలు పెరుగుతాయని, అలాగే పరిశ్రమలకు నదీ జలాలు అందిస్తే ప్రజలందరికి ప్రయోజనకరంగా ఉంటుందని ఆశిస్తున్నారు.

రణస్థలం మండలం

అక్కయ్యపాలెం, అర్జునవలస, బంటుపల్లి, బోయపాలెం, చిల్లపేట రాజాం, చిట్టివలస, దేరసాం, గిరివానిపాలెం, గోసాం, జె.ఆర్.పురం, జీరుకొవ్వాడ, కొండములగాం, కోష్ట, కోటపాలెం, కొచ్చెర్ల, క్రిష్ణాపురం, మహంతిపాలెం, మరువాడ, మెంటాడ, ముక్తుంపురం, ఎన్‌జీఆర్‌పురం, నారువ, నెలివాడ, పాపారావుపేట, పాతర్లపల్లి, పాత సుందరపాలెం, పిషిణి, పైడిభీమవరం, రామచంద్రపురం, రణస్థలం, రావాడ, సంచాం, సీతంవలస, సీతారాంపురం, సూరంపేట, సూరాపురం, టెక్కలి, తెప్పలవలస, తిరుపతిపాలెం, ఉప్పివలస, వల్లభరావుపేట, వి.ఎన్.పురం, వరిసాం, వెల్బురాయి, వెంకటరావుపేట, ఎర్రవరం.

జి.సిగడాం మండలం

దేవరవలస, గెద్దకంచరాం, నాయుడువలస, పొన్నాం, సర్వేశ్వరపురం గ్రామాల్లో భూగర్భ జలాలు అట్టడుగు స్థాయిలో ఉన్నాయని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

లావేరు మండలం

అదపాక, అప్పాపురం, బరిణికాం, బుడతవలస, గోవిందపురం, జీజే వలస, గుమడాం, కేశవరాయునిపాలెం, కొండకుంకాం, కొత్తకుంకాం, లావేరు, నాగంపాలెం, నీలాపురం, నేతేరు, పెదలింగాల వలస, పోతయ్యవలస, తామాడ.

చర్యలు చేపట్టాలి

మండలంలోని 46 గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు వేయకుండా నిషేధించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. భూగర్భ జలాలు పెంపునకు అధికారులు చర్యలు చేపట్టాలి. తోటపల్లి నీరు పూర్తి స్థాయిలో వచ్చేలా చూడాలి. పరిశ్రమలు భూగర్భ జలాలు వాడకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలి.

– రెడ్డి విశ్వేశ్వరరావు,
రణస్థలం సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు

పెంపునకు చర్యలు

ఉపాధి పనుల ద్వారా వ్యవసాయ క్షేత్రాల్లో నీటి కుంటలు తవ్వకాలు వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయి. 20 పంచాయతీల్లో రైతుల సహకారంతో నీటి కుంటలు తవ్వకాలకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. 9 మీటర్ల వెడల్పు, 9 మీటర్ల పొడవు, రెండు మీటర్ల లోతున ఉపాధి హామీ పనుల్లో భాగంగా తవ్వకాలు జరపాల్సి ఉంది. ఇప్పటి వరకు 167 మంది నీటి కుంటలు తవ్వడానికి ముందుకు వచ్చారు. భూగర్భ జలాలు పెంపునకు మెట్ట భూముల్లో కందకాలు తవ్వకాలతోపాటు చెరువు పనులు, నీటి కుంటలు తవ్వకాలు వంటి చర్యలు చేపడుతున్నాం.

– శ్రీనివాసనాయుడు,
ఎన్ఆర్‌జీఎస్ ఏపీఓ, రణస్థలం

సాయం అందజేత



నాగమణి కుటుంబానికి ఆవు, దూడ అందిస్తున్న ఎంపీ అప్పలనాయుడు

రణస్థలం: ఇటీవల అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మూడో సంతానంగా ఆడబిడ్డ జన్మించిన కుటుంబానికి రూ.50 వేలు, మగబిడ్డ జన్మించిన కుటుంబానికి ఆవు, దూడ అందజేస్తామని ప్రకటించారు. చెప్పిన విధంగానే మండల కేంద్రంలోని ఎంపీ కార్యాలయం వద్ద ఆదివారం శ్రీనిఖిల నాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడు కుటుంబాలకు అందజేశారు. మండలంలోని పాతర్లపల్లి గ్రామానికి చెందిన పొన్నాడ వెంకటలక్ష్మికి మూడో సంతానంగా ఆడబిడ్డ పుట్టినందుకు రూ.50 వేలు, కొవ్వాడ మత్స్యలేశం గ్రామానికి చెందిన మైలపల్లి శాంతమ్మకు మగబిడ్డ పుట్టినందుకు గాను ఆవు, దూడ అలాగే లావేరు మండలంలోని కొత్త కుంకాం గ్రామానికి చెందిన కుప్పిలి నాగమణికు మగబిడ్డ పుట్టినందుకు ఆవు, దూడ అందజేశారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని హయాతినగరం గొల్లవీధిలో ఓ స్థలం విషయమై ఈ నెల 17న ఇరువర్గాల మధ్య తగాదా దాడికి దారితీసింది. దీనిపై ఒకటో పట్టణ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. గొల్లవీధి (అలబాన వీధి) ఏటి ఒడ్డు నదీ సమీపంలో కేశవస్వామి దేవస్థానం భూమిని ఆనుకొని నివాస గృహాల ముందు జాగా విషయమై గొడవ జరిగింది. ఈ ఘటనలో శ్రావణి అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా, దాడికి పాల్పడిన అలబాన సోదరుల్లో జగదీష్ అనే వ్యక్తి ఓ టీడీపీ నాయకుని వద్ద డ్రైవర్‌గా ఉంటున్నాడని, తమ కుటుంబంపై దాడి జరిగితే ఆ టీడీపీ నాయకుడు పోలీసులతో మాట్లాడి పలుకుబడి ఉపయోగించి కేసులో ప్రాధాన్యత తగ్గించారని బాధితుడు చిన్ని రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎస్ఐ హరికృష్ణ వద్ద ప్రస్తావించగా గాయాలు చిన్నవేనని, ఇరువైపులా స్థల విషయమై గొడవలుండటంతో కేసులు నమోదు చేశామన్నారు.

భగవద్గీత తరగతులు



బలగ హరేరామ మందిరంలో చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు భగద్గీత శ్లోక కంఠస్త తరగతులను ఆదివారం నిర్వహించారు. పరాత్మానంద సరస్వతీ స్వామీజీ చిన్నారులకు భగవద్గీతలోని నాలుగో అధ్యాయమైన జ్ఞానకర్మ, సన్యాసయోగంలోని శ్లోకాలను చిన్నారులచే పఠనం చేయించారు. కార్యక్రమంలో చిన్మయ మిషన్ ప్రతినిధులు కె.వెంకటేశ్వరులు తదితరులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

రోడ్డు పక్కనే వ్యర్థాలు



జాతీయ రహదారి బైపాస్ రోడ్డు కింతలిమిల్లు నుంచి చిలకపాలేం వరకు విస్తరించి ఉంది. అయితే ఈ సర్వీస్ రోడ్డు పక్కన వ్యర్థాలు పడేస్తున్నారు. కింతలిమిల్లు నుంచి ఎడమ పక్క ఉన్న సర్వీస్ రోడ్డుపై ఎక్కువగా పాత గృహాలు తొలగించిన వ్యర్థ నిర్మాణ సామగ్రి, ప్లాస్టిక్ వ్యర్థాలు ట్రాక్టర్లతో తెచ్చి పోగులు వేస్తున్నారు. ఈ వ్యర్థాలు రోడ్డుపైకి సైతం వస్తున్నాయి. ఫలితంగా వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు సైతం పాడవుతోంది.

– ఎచ్చెర్ల క్యాంపస్

పగలే వెలుగులు



లావేరు మండలంలోని పలు గ్రామాల్లో పట్టపగలే విద్యుత్ దీపాలు వెలుగులు చిమ్ముతున్నాయి. ఇక్కడ వీధిలైట్లు నిరంతరం వెలుగుతుండడంతో విద్యుత్ వృథా అవుతోంది. లావేరు గ్రామంలో మిట్ట మధ్యాహ్నం వెలుగుతున్న విద్యుత్ దీపాలు దర్శనమిచ్చాయి. దీంతో ప్రజలు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

– ఎచ్చెర్ల

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ ప్రార్థనలు



క్రైస్తవారాధన చర్చిలో ప్రార్థనలు



తెలుగు బాప్టిస్టు చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



గార: ఏసుక్రీస్తు మహిమమందిరంలో..



గార : కేక్ కటింగ్ చేస్తున్న క్రైస్తవులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు చర్చిల్లో ఈస్టర్ పర్వదినాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గుడ్ ఫ్రై డే తర్వాత క్రీస్తు లేచిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవ ఆరాధన కేంద్రం, సహాయ మాత ఆలయం, టౌన్ హాలు చర్చి, కీస్టోన్ చర్చి, తెలుగు బాప్టిస్టు చర్చిలలో ప్రార్థనలు, క్రైస్తవ గీతాలాపనలు జరిగాయి. సమాధుల వద్దకు వెళ్లి పితృదేవతలకు ప్రార్థనలు చేశారు.

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక తెలుగు బాప్టిస్టు చర్చిలో ఈస్టర్ సందర్భంగా సామూహిక ప్రార్థనలు జరిగాయి. ఫాదర్ క్రీస్తుసందేశం వినిపించగా, ఆరాధకులు గీతాలు ఆలపించారు.

గార : ఈస్టర్ ప్రార్థనలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం గారలో ఏసుక్రీస్తు మహిమ మందిరంలో బిషప్ వి.జాషువా ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసు మృత్యుంజయునిగా మూడో రోజు తిరిగి లేచి ప్రజలందరికీ సమాధానం, శాంతి, సంతోషాలు అందించారని పేర్కొన్నారు. ఏసు ప్రభువు సుగుణాలను భక్తులకు తెలియజేశారు. చిన్నారుల మధ్య కేక్ కటింగ్ చేసి, భక్తులు గీతాలాపన, అన్నసమారాధన నిర్వహించారు.

చెట్టు కింద బిజీనెస్

జిల్లా కేంద్రంలోని డే అండ్ నైట్ బ్రిడ్జి దాటాక ఫుట్‌పాత్ వ్యాపారం ఫుల్‌జోష్‌గా సాగుతోంది. రోడ్డుకు ఇరువైపులా పెద్ద సంఖ్యలో తాత్కాలిక దుకాణాలు వెలిశాయి. గృహోపకరణాల నుంచి తినుబండారాలు వరకు, చిన్నారుల కుర్చీల నుంచి ఇంటీరియర్ డెకరేషన్ వస్తువులు వరకు ప్రతి వస్తువులు తక్కువ ధరలకే లభ్యం కావడంతో వినియోగదారులు సైతం కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.

– శ్రీకాకుళం కల్చరల్



చెట్టు కింద కూరగాయల దుకాణాలు



పూలకుండీలు



ఇండోర్, అవుట్‌డోర్ ప్లాంట్స్



ప్లాస్టిక్ బుట్టలు



ఇంటి అలంకరణ వస్తువులు



పింగాణీ వస్తువులు, కలపతో తయారు చేసి బుట్టలు



చిట్టిపొట్టి మంచాలు



ప్లాస్టిక్ కుర్చీలు, టీపాయ్



సాధారణ చెప్పలు